విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 10, సెప్టెంబర్ 2025

రైతుకు గిట్టుబాటు ధర, యూరియా కోసం కదం తొక్కి రోడ్డెక్కిన రైతన్నలు

రైతులకు అండగా వైసీపీ, రైతు సంఘాల నేతలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు అన్నదాతలకు అండగా నిలుస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు నంద్యాల, ఆళగడ్డ, పాణ్యం నియోజక వర్గాల నుండి పాణ్యం మాజీ ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, ఆళ్ళగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, రాష్ట్ర మాజీ మర్కెఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిపి మధుసూధన్ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ బాబున్నీసా, ఎంపిపిలు ప్రభాకర్, సైమన్, వైసీపీ నాయకుడు భూమా కిషోర్ రెడ్డి, మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ డా. శశికళ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దాల్మిల్ అమీర్ బాష, సూర్య నారాయణ రెడ్డి, జిల్లా వైసీపీ నేతలు, రామలింగా రెడ్డి, రైతు సంఘాల నేతలు, అన్నదాత పోరుబాట పట్టారు. అన్నదాత కష్టాలను తీర్చాలని యూరియా కొరత లేకుండా అందించాలని, ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలని పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్ కు అందజేశారు. అన్నదాత పోరు కార్యక్రమానికి రైతులు కదంతొక్కారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో గత రెండు నెలలుగా యూరియా కొరతతో రైతన్నలు రోడెక్కారని, కూటమి ప్రభుత్వం యూరియా నిల్వలు ఉన్నాయని చెబుతున్నారని, అయితే రాష్ట్రంలో ఏ గ్రామంలో చూసినా యూరియా కోసం రైతులు ఎందుకు అగచాట్లు పడుతున్నారని ప్రశ్నించారు. యూరియా కొరత ఉందని టీడీపీ అనుకూల పత్రికల్లో కూడా ప్రధాన శీర్షికల్లో వార్తలు వస్తున్నా కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తిన రీతిగా వ్యవహరించడం జరుగుతుందని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించలేకపోతున్నారని, ఉల్లిధర పడిపోయిన పరిస్థితిలో ప్రభుత్వం మద్దతు ధర కల్పించలేదన్నారు. కూటమి ప్రభుత్వం మంచి చేస్తే రైతులు ఎందుకు రోడ్డెక్కుతారని సూటిగా ప్రశ్నించారు. తమకు అడుగడుగునా ఆంక్షలను విధుస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. కొరతతో యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలి పోతున్నదని, ప్రక్కదారి పడుతున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం మేలుకోవాలని, ధరల స్థిరీకరణ తీసుకువచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేంతవరకు వారికి అండగా ఉంటామని, తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తేలేదని, రైతుల కోసం ఎందాకైనా వెళ్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ శేఖర్ రెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు పురుషోత్తమ రెడ్డి, విజయశేఖర్ రెడ్డి, మాజీ పిఎసిఎస్ చైర్మన్ రామసుబ్బా రెడ్డి, వైసీపీ నేతలు పద్మజ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలపై వైసీపీ తప్పుడు ప్రచారం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గత ప్రభుత్వం చేసిన వినాశనం నుంచి రాష్ట్రాన్ని కాపాడటానికి ప్రత్యేక దృష్టి పెట్టిందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించి అక్కడ జరుగుతున్న పనితీరును అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కాలేజీని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడున్న విద్యార్థులకు వసతులను ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడం లేదని, మౌలిక సదుపాయాలను వేగంగా నిర్మించడానికి, మరిన్ని వైద్య సీట్లను కల్పించడానికి పిపిపి నమూనాను అవలంబిస్తోందని వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటుంద న్నారు. రాష్ట్రంలో ఇంతకు ముందెన్నడూ చూడని సంక్షేమం తాము అందిస్తున్నామని, ప్రజ లకు వేగవంతమైన మెరుగైన చికిత్స అందించడానికి కొత్త సార్వత్రిక బీమా పథకం తీసుకొస్తున్నామన్నారు. జగన్మోహన్ రెడ్డి పెట్టిపోయిన ఆరోగ్యశ్రీ అప్పుల కుప్ప కూడా కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఈ అసంపూర్తి పనులను వేగంగా పూర్తి చేస్తూ, పిపిపి మోడల్ 10 కొత్త కాలేజీలను స్థాపిస్తోందని, ఇవి ఛారిటబుల్ ట్రస్ట్ లేదా సెక్షన్ 8 కంపెనీల ద్వారా లాభాపేక్ష లేకుండా సేవాభావంతో నిర్వహించబడ తాయన్నారు. ఇందులో ఎక్కడ దోపిడీ ఉందో జగన్మోహన్ రెడ్డి నిరూపించాలన్నారు.

ఏపీవో వసుధకు డాక్టరేట్

విశాలాంధ్ర - బండి ఆత్మకూర్ : ఏపీవో వసుధకి డాక్టరేట్ ద్రవిడ యూనివర్సిటీ నుంచి మెయిల్ ద్వారా డాక్టరేట్ ఇచ్చినట్లు సమాచారం అందినట్లు ఆమె తెలిపారు. గతంలో కడప జిల్లా రామాపురం పెండ్లమరి సుండుపల్లి మండలాలలో ఆచార జానకిరామయ్య పర్యవేక్షణలో ఇంద్ర కాంతి పథకం స్వయం సహాయక సంఘాలపై ఆమె పరిశోధనలు చేశారు. అందుకుగాను ఉపాధి హామీ పథకంలో ఏపీవోగా పని చేస్తున్న వసుధకి డాక్టరేట్ ఎంపిక చేశారు.

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - మిడుతూరు: పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి ఆపన్నహస్తం అందిస్తున్న చంద్రబాబుకు కృతజ్ఞత కల్గిఉండాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. మంగళవారం మండలానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ. 6,09,644 ల చెక్కులను లబ్ధిదారుల గృహాలకు వెళ్లి స్వయంగా ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దశరథ రామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాదరెడ్డి, వైస్ చైర్మన్ సుధాకర్ యాదవ్, సర్పంచులు జయ లక్ష్మమ్మ, మరియమ్మ, నాయకులు వంగాల శివరామిరెడ్డి, నాగ స్వామి రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, కమతం వీరారెడ్డి, కమతం రాజశేఖర్ రెడ్డి, నాగేంద్ర, రామేశ్వర రెడ్డి, చౌట్కూర్ గౌడ్, జయరాముడు, పురుషోత్తం రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఈ నెల 11న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-రుద్రవరం: ఈ నెల 11న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10:30లకు ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన సమావేశము ప్రారంభమవుతుందన్నారు. మండ లంలోని ఎంపీటీసీలు, జడ్పిటిసి సర్పంచులు, పంచా యతీ కార్యదర్శులు ఆయా శాఖలకు చెందిన అధికారులు వారి, వారి ప్రగతి నివేదికలతో సమావేశానికి తప్పకుండా హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు పండితులు లక్ష్మయ్య ఉపా ధ్యాయ దినోత్సవ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన విషయం తెలిసిందే. స్థానిక పాఠశాలలో మంగళవారం హెచ్ఎం శివలీల అధ్యక్షతన సన్మాన సభ ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు, ప్రసంసా పత్రం అందుకున్న పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు లక్ష్మయ్యను స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు వరప్రసాద్, మండల తెలుగు యువత అధ్యక్షులు మద్దూరు మాబులాల్, హెచ్ఎం శివలీల, ఉపాధ్యాయినీల బృందం పూలమాల, శాలువలతో ఘనంగా సన్మానించారు.

నంద్యాలలో భార్యను హత్య చేసిన భర్త

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: పట్టణంలోని ఎన్జీవో కాలనీలో మంగళవారం దారుణం చోటుచేసుకుంది. పౌరోహిత్యం చేసి జీవనం సాగిస్తున్న సాయినాథ్ శర్మ కట్టుకున్న భార్య శిరీషను కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. భార్య శిరీష పెద్ద మొత్తంలో అప్పులు చేయడంతో ఇద్దరూ పరస్పరం గొడవపడి, క్షణికావేశంలో హత్య చేశాడు. అనంతరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. ఈ మేరకు సిఐ అస్రార్ బాష కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యూరియా మాఫియాను అరికట్టండి : సీపీఐ

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్: పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో యూరియా మాఫియా జరుగుతుందని, రైతులకు అందాల్సిన యూరియాను పక్క దారి పట్టిస్తూ రూ. 270 అమ్మాల్సిన బస్తా రూ. 600 రైతులకు విక్రయిస్తూ ధనార్జనే ధ్యేయంగా ప్రైవేట్ దుకాణ దారులు మోసం చేస్తున్నారని, తక్షణమే ప్రత్యేక విజిలెన్స్ అధికారులచే దర్యాప్తు నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు, ఆత్మకూరు తాలూకా కార్యదర్శి టి.ప్రతాప్‌లు డిమాండ్ చేశారు. యూరియా మాఫియ అరికట్టాలని కోరుతూ మంగళవారం ఇంచార్జి ఏడిఏ హేమలతకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా కొరత పై రైతుల పక్షనా ఆందోళన కొనసాగిస్తున్నప్పటికీ అధికార ప్రభుత్వం మాత్రం యూరియా కొరతలేదని చెబుతుందని, అధికార పార్టీ నాయకులకు యూరియా కొరత ఏ మాత్రం లేదని పేద రైతులకు యూరియా కొరత ఉందన్నారు. రైతులకు సకాలంలో యూరియా అందకుండా ఉంటే లారీలు లారీలు ఎక్కడ తరలిపోతున్నాయని యూరియా మాఫీయా అడ్డాగా మారిందని వారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో యూరియా మాఫియా సీడ్స్ ఫర్టిలైజర్స్ యాజమా న్యాలు ధనార్జన ధ్యేయంగా, అధికరేట్లకు విక్రయిస్తూ రెండు లేడ్జర్ బుక్కులతో వ్యాపారం కొనసాగిస్తున్నారని వారిపై ప్రత్యేక విజిలెన్స్ అధికారిచే దర్యాప్తు జరిపించాలని వారు డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ నాయకులు మహమ్మద్ హుస్సేన్, లల్లూ, పాములపాడు మండల నాయకులు అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనంత ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని ప్రముఖ విద్యా సంస్థ అనంత ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్‌లో టిటిసి, డిగ్రీ విద్యనభ్యసించిన 15 మంది విద్యార్థులు ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ పరీక్షల్లో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు సాధించారు. ఈ విజయాన్ని పురస్కరించుకొని మంగళవారం అనంత విద్యాసంస్థల్లో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత విద్యా సంస్థల అధినేత అనంత రామ సుబ్బారెడ్డి, చైర్ పర్సన్ అనంత విజయలక్ష్మి, కోట కందుకూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎర్రమళ్ళ రాజు, అధ్యాపకులు పాల్గొని విజయాన్ని సాధించిన విద్యార్థులను అభినందించారు. చిరంజీవి అనే విద్యార్థి చిన్న తనంలోనే తల్లి దండ్రులను కోల్పోయిన మేనమామ, కళాశాల యాజ మాన్యం సహకారంతో పట్టుదలగా చదువుకుని మెగా డీఎస్సిలో ఎస్జిటి, స్కూల్ అసిస్టెంట్, టీజీటీ ఉద్యోగాలు సాధించడం విశేషం. ఈ సందర్భంగా అనంత రామసుబ్బారెడ్డి మాట్లా డుతూ విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామన్నారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజు మాట్లాడుతూ అనంత విద్యా సంస్థల విద్యార్థులు సాధించిన ఈ గొప్ప విజయాలు కేవలం వారికి మాత్రమే కాదని, జిల్లాకే గర్వకారణం అన్నారు. ప్రస్తుత విద్యార్థులు కూడా వీరి విజయాలను ప్రేరణగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. డీఎస్సీలో విజయం సాధించిన విద్యార్థులు ప్రస్తుతం అనంత విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు తమ విజయ రహస్యాలు, అనుభవాలు పంచుకొని క్రమశిక్షణతో చదివితే తప్పకుండా విజయాన్ని సాధించవచ్చని వారిని ప్రోత్సహించారు.

పాఠశాలలకు బీరువాల వితరణ

విశాలాంధ్ర - చాగలమర్రి: మండలంలోని ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన ధ్యేయంగా కంకణం కట్టుకున్న చాగలమర్రి మండల శాఖ పిఆర్టియు సంఘం నాయకులు బీరువాలను మంగళవారం వితరణ చేశారు. పిఆర్టియు రాష్ట్ర కౌన్సిలర్ బి.రవీంద్రారెడ్డి మాట్లాడుతూ రెండో విడతలో భాగంగా చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలకు 11750 విలువ చేసే ఐదు అల్మారా రాక్స్ హెచ్ఎం జీవయ్య, చాగలమర్రి బాలికోన్నత పాఠశాలకు రూ.9400 విలువ చేసి 4 ర్యాక్స్ హెచ్ఎం శివలీల, మండలంలోని మద్దూరు ఉన్నత పాఠశాలకు రూ.12 వేల విలువ చేసే బీరువా పాఠశాల హెచ్ఎం మహబూబ్ బాష, చిన్న వంగలి ఉన్నత పాఠశాలకు రూ.10 వేలు చేసే బీరువా హెచ్ఎం సుధాకర్ గుప్తా, గొడుగునూరు ఉన్నత పాఠశాలకు రూ.4500 విలువచేసే రెండు రాక్స్ హెచ్ఎం శ్రీనివాసులకు మొత్తం సుమారు ర.50 వేల విలువ చేసే వాటిని పిఆర్టియు మండల శాఖ తరపున అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు డి.మౌలాలి, జిల్లా నాయకులు నారాయణమూర్తి, రవి ప్రకాష్ రెడ్డి, రవి శంకర్ రెడ్డి, షరీఫ్, మండల నాయకులు, సురేష్, దస్తగిరి, శ్రీనివాసులు, మోహన్ రాజు, బాబు, రాజ్ కుమార్, సుబ్బయ్య, రత్నకుమారి, దిల్షాద్ బేగం, సుధా కుమారి, తహరే బేగం పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే నూర్ బాషల అభివృద్ధి

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ: దూదేకుల, నూర్ బాష కార్పొరేషన్ ఏర్పాటు చేసి 15 డైరెక్టర్లుగా నియమించిన కూటమి ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు మండలం జనసేన పార్టీ అధ్యక్షులు దూదేకుల కోట్ల బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నూర్ బాష దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నంద్యాల జిల్లాకు చెందిన దూదేకుల మహబూబ్ కాశీం సాహెబ్ బనగానపల్లె (టీడీపీ), దూదేకుల దస్తగిరి నంద్యాల (టీడీపీ) దూదేకుల ఇమామ్ హుస్సేన్ ధర్మవరం (జనసేన), షేక్ బాషా లిమ్రా రాజమండ్రి (జనసేన)లను నియమించారన్నారు.

మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన దస్తగిరి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నంద్యాల నియోజకవర్గ టీడీపీ సీనియర్ టీడీపీ నాయకులు దూదే కుల దస్తగిరి రాష్ట్ర నూర్ బాష దూదేకుల కార్పొరే షన్ డైరెక్టర్‌గా ఎన్నికవ్వ డంతో మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ని మర్యాదపూర్వ కంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నంద్యాల టీడీపీ మున్సిపల్ కౌన్సిలర్ దూదేకుల జైనాబీ, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దూదేకుల దస్తగిరి మాట్లాడుతూ నూర్ భాషా దూదేకుల అభివృద్ధికి పాటు పడతానన్నారు.

పైరుకు పచ్చదనం.. రైతుకు ఆదాయం

విశాలాంధ్ర - శిరివెళ్ల : నానో యూరియా స్ప్రే చేయించడం వల్ల పైరు పచ్చదనంగా మొక్కలు బలంగా పెరిగి రైతన్నకు అధిక దిగుబడిని అందించి అధిక ఆదాయాన్ని ఇస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ తెలిపారు. మండల పరిధిలోని వెంకటేశ్వరపురం గ్రామ పరిధిలోగల మాగాని వరి పైరుకు సుమారు 50 మంది రైతులతో నానో యూరియా స్ప్రే చేపించి డెమో నిర్వహించారు. బస్తా యూరియా పంటకు చల్లడం వల్ల భూమి పీల్చుకొని తద్వారా మొక్కలు వేర్ల ద్వారా ఆలస్యంగా గ్రహించడం జరుగుతుందన్నారు. నానో యూరియా స్ప్రే చేస్తే నేరుగా మొక్క గ్రహించి నత్రజని ద్వారా బలమైన మొక్కగా ఎదిగి అధిక దిగుబడిని ఇచ్చేందుకు పచ్చని పైరుకు నిదర్శ నంగా ఉంటుందన్నారు. ప్రతిరైతు యూరియాకు ప్రత్యామ్నా యంగా నానో యూరియాను వాడి అధిక పెట్టుబడిని తగ్గించి వ్యవ సాయ శాఖ సూచించిన మోతాదులో వాడి అధిక దిగుబడులు సాధిం చాలని ఏఓ సుధాకర్ కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ విస్తరణ, సహాయకులు, ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

17 వేల ఎకరాల్లో సాగైనా మాగాని

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని ఆయా గ్రామాలలో కేసీ కెనాల్, తెలుగుగంగ ఆయకట్టు భూములలో 17వేల ఎకరాలలో మాగాని వరి పంటను రథన్నలు సాగు చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ తెలిపారు. అన్నదాతలు సాగు చేసిన మాగానికి అవసరమైన యూరియా అందించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే శిరివెళ్ల మండలానికి యూరియా భారీగా దిగుమతి అయినట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం మాగాని వరి పంటకు మొదటి దశ మందుల కోట చల్లడం అయిపోయిందని మరో వారంలో రెండో కోట సైతం పూర్తి కాబోతున్నదని అన్నారు. తరువాత యూరియా డిమాండ్ శిరివెళ్ల మండలంలో పెద్దగా ఉండదని వ్యవసాయ అధికారి సూచించారు. ప్రస్తుతం మాగాణి వరి పంటను 17 ఎకరాల్లో సాగుచేయగా రైతు సేవ కేంద్రాల ద్వారా 542 మెట్రిక్ టన్నులు దిగుమతి చేసుకొని రైతులకు యూరియా పంపిణీ చేశామన్నారు. అలాగే బోయలకుంట్ల సొసైటీకి 244 ఎం టన్నులు, శిరివెళ్ల సొసైటీకి 230 టన్నులు, యర్రగుంట్ల గ్రామంలోని వరలక్ష్మి గ్రామైక్య సంఘం తరఫున 87 టన్నులు, చెన్నూరు ఎఫ్ సి ఓ కేంద్రానికి 54 మెట్రిక్ టన్నులు, మన గ్రోమోర్ సెంటర్‌కు సైతం యూరియా అలాట్ చేసినట్లు అధికారికంగా శిరివెళ్ల మండలానికి దిగుమతి చేసుకొని పంపిణీ చేసినట్లు తెలిపారు. గురు శుక్రవారాల్లో శిరివెళ్ల ఆర్ఎస్ కే కేంద్రానికి యూరియా రాబోతున్నదని రైతులకు టోకెన్ల వారీగా పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. శిరివెళ్ల మండలానికి ఇంతటి భారీ స్థాయిలో యూరియా దిగుమతి అయినప్పటికీ కొరత కొరత అంటూ ప్రచారం జరుగుతున్నదని. రైతన్నలు యూరియాను అవసరం మేరకు పంటలకు ఉపయోగించాలని అధిక మోతాదు వాడడం వల్ల పలు రకాల వైరస్‌లు, కీటకాలు పంటలను ఆశిస్తాయని వ్యవసాయ అధికారి సుధాకర్ సూచించారు. సొసైటీలు ఇతర కేంద్రాలకు దిగుమతి అయిన యూరియా ఎవరికి ఎంత మేరకు ఎలా పంపిణీ చేశారన్నది ఆయా సొసైటీ సీఈఓలు సిబ్బంది తెలియజేయాల్సి ఉందని అన్నారు. శిరివెళ్ల మండల వ్యాప్తంగా అన్నదాతల సహకారంతో ప్రశాంత వాతావరణంలో యూరియ పంపిణీ జరిగిందని యూరియాను అధిక రోజులు స్టాక్ పెడితే గడ్డకట్టి పైరుకు చల్లేందుకు పనికిరాని విధంగా తయారవుతుందని ఏవో సూచించారు. మరో వారం రోజుల్లో యూరియా విరివిగా లభించే అవకాశం ఉన్నదని ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి సుధాకర్ స్పష్టం చేశారు.

రసాయనక ఎరువులు తగ్గిస్తే మేలు

విశాలాంధ్ర - చాగలమర్రి : రైతులు రసాయనక ఎరువుల వాడకం తగ్గిస్తే ఎంతో మేలు అని మండల వ్యవసాయ అధికారి రంగనేతాజీ తెలిపారు. మండలంలోని శెట్టివీడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ యూరియా వాడకం గురించి యూరియా ఎక్కువ వాడడం వలన వచ్చు నష్టాల గురించి వివరించారు. యూరియా ఎక్కువగా వాడితే భూమి సారవంతం దెబ్బతిని వంట వేసుకోవడానికి అనికూలంగా లేకుండా ఉంటుంది. యూరియా తగ్గించి నానో యూరియా, సహజ ఎరువులు వాడకం పెంచడం వల్లన భూమిలో సారవంతం పెరుగుతుందన్నారు. ఖరీఫ్‌లో పంటలు వేసిన ప్రతి ఒక్క రైతు సోదరులు ఈ క్రాప్ నందు నమోద్ చేయించుకోవాలని తెలియజేశారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించి, భూమిలో సారవంతం పెరిగే విధంగా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

లీకేజీ తాగునీటి పైపుల మరమ్మతులు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో లీకేజీ తాగునీటి పైపులను తొలగించివాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేశారు. మంగళవారం గ్రామ సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో లీకేజీ తాగునీటి పైపులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు వినియోగం కానీ పైపులను తొలగించి కొత్త వాటిని అమర్చారు. గత కొంతకాలంగా తహసిల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం ఎదుట తాగునీరు సరఫరా చేసే పైపులు దెబ్బతిన్నాయి. దీంతో లీకేజీలు ఏర్పడి తాగునీరు కలుషితమైందని, సర్పంచ్ శివ రాముడు స్పందించి పాత పైపులను తొలగించి, కొత్త వాటిని ఏర్పాటు చేసి తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకున్నారు.

స్కూలు బస్సు ఢీకొని బాలుడు మృతి

విశాలాంధ్ర-అవుకు: మండలంలోని సుంకేసుల గ్రామంలో స్కూలు బస్సు ఢీకొని బాలుడు ఎర్రబెల్లి మహిదర్ మృతి చెందిన సంఘటన మంగళ వారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుంకేసుల గ్రామానికి చెందిన ఎర్రబెల్లి శ్రీనివాసులు, మీనాక్షిలకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు. రెండవ కూతురు కోయిలకుంట్ల పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నది. కూతురును పాఠశాలకు చెందిన బస్సులో ఎక్కించేందుకు రాగా కుమారుడు ఎర్రబెల్లి మహిదర్ బస్సు వద్దకు రావడం జరిగింది. బస్సు డ్రైవరు బాలుడిని గమనించకుండా నిర్లక్ష్యంగా ముందుకు నడపడంతో బస్సు ఢీకొని బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన బాలుడిని అదే స్కూలు బస్సులో అవుకు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి వెల్లడించారు.

ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: రాష్ట్ర వైసీపీ పిలుపుమేరకు ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాతపోరు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని స్థానిక వైసీపీ కార్యాలయం నుండి శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గం వైసీపీ ఇంచార్జీ దారా సుధీర్ బాబు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, నందికొట్కూరు ప్రాంతాల రైతన్నలు పాల్గొని బైక్ ర్యాలీగా ఆర్డీవో కార్యాలయం వరకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు ఆర్డీవో నాగజ్యోతికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వాళ్ళు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతన్నలకు యూరియా అందించడంలో విఫలమైందన్నారు.

ఉపరాష్ట్రపతి ఎంపికకు ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ఢిల్లీలోని భారత పార్లమెంట్ ఆవరణలో మంగళవారం జరుగుతున్న భారత ఉప రాష్ట్రపతి ఎంపిక ఎన్నికల్లో నంద్యాల ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి క్యూలో నిలిచి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం భారతదేశ బలానికి ప్రతీక అని, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామిగా ఉండేందుకు తన ఓటు హక్కు వినియోగించుకోవడం గర్వంగా ఉందని ఆమె చెప్పారు.

బస్సు కోసం విద్యార్థుల పడిగాపులు

విశాలాంధ్ర - హొళగుంద: సులువాయి గ్రామానికి సమయానికి బస్ నడపాలని బస్సు విద్యార్థులు, విద్యార్థి సంఘం నాయకులు, గ్రామ వాసులు మంగళవారం బస్సును అడ్డుకున్నారు. సిఐటియు మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ సులవాయి, పెద్దహేట మూగమనగుంది, సమతగేరిలో దాదాపు వంద మంది విద్య కోసం హొళగుందకు రాకపోకలు కొనసాగిస్తున్నారనిబస్సులను పాఠశాల కళాశాల సమయానికి అనుకూలంగా నడపాలని డిమాండ్ చేశారు. తాము ప్రతిరోజు పాఠశాల కళాశాలకు వస్తున్నప్పటికీ బస్సుల ఆలస్యంతో తమకు ఆబ్సెంట్ పడుతుందని, ఇదేవిధంగా ఆబ్సెంట్ పడితే హాజరు తక్కువ ఉందని హాల్ టికెట్లు ఇవ్వక పరీక్షలకు కూర్చోబెట్టరని విద్యా ర్థులు తెలిపారు. సాయంత్ర సమయంలో కూడా ఇంటికి వెళ్లేసరికి రాత్రి 7 ఐతుందని విద్యార్థులు తెలిపారు. ఆర్టీసీ అధికారులను అడిగితే రోడ్లు బాగా లేకపోతే మేమేం చేయాలని మీ ఊరికి త్వరలోనే సర్వీసులను నిలిపివేస్తామని చెబుతున్నారన్నారు. బస్సును అడిగితే రోడ్ల గురించి చెబుతున్నారని ప్రభుత్వం రోడ్లు వేయకపోతే తామేం చేయాలని ప్రశ్నించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 10, సెప్టెంబర్ 2025

అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్‌లను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : అంగన్‌వాడీవర్కర్స్ అండ్ హెల్పర్స్ వేతనాలను తక్షణమే పెంచాలని, వారిని కేంద్రప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ని కలసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో 12 ఏళ్ల నుండి గౌరవ వేతనాలు పెంచలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రోజురోజుకు పని భారం పెంచుతున్నారని తెలిపారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం పనిచేయలేమని, సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అందరికీ వర్తింప చేయాలన్నారు. 5 జీబీ మొబైల్స్ తక్షణమే ఇవ్వాలని, గ్రాడ్యూటిలో తక్షణమే సవరణలు చేసి 1972 యాక్ట్ ప్రకారం ఆంధ్రప్రదేశ్లో చెల్లించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి చంద్రశేఖర్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చౌడేశ్వరి, జిల్లా కౌన్సిల్ సభ్యులు మంజుల, పార్వతి, రత్నమ్మలు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఆశావర్కర్స్‌కు సమాన పనికి సమానవేధనం అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రదాన కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. మంగవారం జిల్లా ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు దస్తగిరమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.రంజాబీ హాజరై మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. రోజుకు 8 గంటలు నుండి 10 గంటలు పని చేస్తూ పేద మహిళ గర్భం దాల్చిన మొదలుకొని ప్రసవం అయ్యేంతవరకు జాగ్రత్తగా చూసుకుంటూ, పోలియో టీకాలు, క్షయ వ్యాధిగ్రస్తులకు మందులు నెల నెల మందులు ఇస్తూ అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకు పోతున్నారన్నారు. ఆశా వర్కర్లకు గౌరవేతనం పేరుతో కేవలం రూ.11 వేలు మాత్రమే ఇస్తున్నారని, ఇది వారి కుటుంబ పోషణకు వారి పిల్లల చదువులకు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. తక్షణమే ఆశ వర్కర్లు రూ.26 వేల కనీస వేతనాలు అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న టీఏ, డీఏ అలవెన్సు తెప్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఆశలకు పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఆలూరు నియోజక వర్గం అధ్యక్షులు కృష్ణమూర్తి, నగర ఉప ప్రధాన కార్యదర్శి టి.రామాంజ నేయులు, జిల్లా ట్రెజరర్ నాగ వేణి, కొండమ్మ, పద్మ తదితరులు ఉన్నారు.

సమస్యలు ఉంటే అధికారులను సంప్రదించాలి

విశాలాంధ్ర - సి.బెళగల్: రీసర్వే జాబితాలో సమస్యలు, తప్పు ఒప్పులు ఉంటే సరిచూసుకోవాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి సూచించారు. మంగళవారం బ్రాహ్మణ దొడ్డిలో ఆ గ్రామ వీఆర్ఓ మంజీరా సమక్షంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం తహసిల్దార్ మాట్లాడుతూ రీసర్వే పూర్తి అయిన సందర్భంగా జాబితాను విడుదల చేయడం జరిగిందని, జాబితాలో రైతుల పేర్లు, కొలతలు తేడా, ఇతర సమస్యలు ఉంటే చూసుకొని రెవిన్యూ అధికారులను సంప్రదించాలని ఆమె రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర - ఓర్వకల్లు: జలజీవన్ మిషన్ కింద కనమడకల గ్రామంలో రూ.70 లక్షల అంచనా వ్యయంతో మంజూరైన 90 వేల లీటర్ల కెపాసిటీ గల ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్, పైప్ లైన్ నిర్మాణానికి కన్నమడకల గ్రామ నాయకులుఓర్వకల్లు సింగిల్ విండో అధ్యక్షులు సుధాకరయ్య, బొల్లారం వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించడం జరిగినది. మండల పరిషత్ అభివృద్ధి కారి ఎం.శ్రీనివాసులు, అర్‌డబ్ల్యూఎస్ ఎఈ శ్రీనివాసులు పాల్గొనడం జరిగింది. **సొసైటీ చైర్మన్ లకు సన్మానం:** మండల కేంద్రంలోని ఓర్వకల్లు సొసైటీ చైర్మన్ సుధాకర్ రావు, నన్నూరు సొసైటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి లను రిటైర్డ్ ఎడిఅశోకరత్నం ఆధ్వర్యంలో మంగళవారం ఓర్వకల్లు సొసైటీలో శాలువా పూలమాలతో సన్మానించారు. రాంభూపాల్ రెడ్డి, రమణారెడ్డి, కృష్ణయ్య చౌదరి, రాజేంద్రుడు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-గూడూరు: విద్యార్థులు ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన పెంచుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్ సూచించారు. మంగళవారం మండలంలోని కె.నాగలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఫ్లోరోసిస్ వ్యాధి దంతాలపై ప్రభావం చూపుతుందని, ఆ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. పళ్ళు పసుపు పచ్చ రంగులో మారి చిగుళ్ల మధ్య నల్లగా ఏర్పడి దంతాలు పిప్పిపళ్ళుగా తయారవుతాయని గుర్తు చేశారు. ఫ్లోరైసిస్ వ్యాధి బారిన పడకుండా విద్యార్థులు ముందస్తు వైద్య సూచనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ హిమాం హుస్సేన్, సామాజిక ఆరోగ్య అధికారి ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పదవులు కాదు.. పార్టీ ముఖ్యం

విశాలాంధ్ర - కర్నూలు : తమకు పదవులు ముఖ్యం కాదని, పార్టీయే ముఖ్యమని ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర స్పష్టం చేశారు. మంగళవారం నగరంలోని స్థానిక వెంకట రమణ కాలనీలోని ఏఎస్ఎన్ గుడ్ విల్ టవర్స్‌లో కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జయశ్రీ ఆధ్వర్యంలో డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర సన్మాన సభ జరిగింది. పలువురు బీజేపీ నేతలు ఆయనకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పదవులు ఆశించకుండా, పని చేసుకుంటూ పోయే తత్వం మరే ఇతర పార్టీల్లోలేని విధంగా కేవలం ఒక్క భాజపా కార్యకర్తల్లోనే ఉందన్నారు. పార్టీ బలోపేతానికి, పటిష్టతకు శ్రమించే కార్యకర్తలను ఎన్నడూ విస్మరించదన్నారు. పార్టీ కార్యకర్తలకు తానెల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. బీజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి, బీజేపీ కోశాధికారి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళీ నాయుడు, జిల్లా అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ లోకేశ్, న్యాయవాది కోటి యాదవ్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్ నాయుడు, మంజునాథ్, బిజెపి కార్యదర్శి నగేష్,1వ మండలం అధ్యక్షురాలు మనోహరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : పెద్దకడబూరు గ్రామ శివారుల్లో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వగరూరు గ్రామానికి చెందిన హసీనా మృతి చెందినట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు మంత్రాలయం మండలం వగరూరు గ్రామానికి చెందిన ఖాదర్ బాష, తల్లి హసీనాతో బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్‌పై ఆదోనివైపు నుంచి వస్తుండగా, మండల పరిధిలోని చిన్నకడబూరు గ్రామానికి చెందిన కల్లు లక్ష్మయ్య కుమారుడు బోయకల్లు హనుమయ్య తన మోటార్ సైకిల్‌పై పెద్దకడబూరు నుంచి వెళుతుండగా గ్రామ శివారులో ఉన్న స్వామి షాపు ముందు వగరూరు ఖాదర్ బాష వేగంగా, అజాగ్రత్తగా చిన్న కడబూరు గ్రామానికి చెందిన బోయ హనుమయ్య మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టాడు. దీంతో ఆమె కిందపడి రక్త గాయాలు కాగా, కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. బోయ హనుమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

నేడు సురవరం సుధాకరరెడ్డి సంస్మరణ సభ

విశాలాంధ్ర - కోడుమూరు: పట్టణంలోని శ్రీ స్నేహ వినాయక కళ్యాణ మండపంలో బుధవారం సిపిఐ పూర్వపు జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు దివంగత నేత కామ్రేడ్ సురవరం సుధాకర రెడ్డి సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు సిపిఐ నాయకులు బి.కృష్ణ, బి.రాజు, శేషుకుమార్ యాదవ్, చిన్న రాముడులు తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ పి.రామచంద్రయ్య తోపాటు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిలు లెనిన్ బాబు, ఎస్.మునెప్ప తదితర ప్రముఖులు హాజరవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు బజారి,ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మధు, ఏఐఎస్ఎఫ్ నాయకులు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర- ఎమ్మిగనూరు రూరల్: మండలంలోని కడిమెట్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి శివశంకర్ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ సలహాలు, సూచనలు పాటు రైతులు ఎక్కువగా యూరియా వాడకూడదన్నారు. అవసరం మేరకే యూరియా వాడాలన్నారు. మామూలు యూరియా వాడడం వల్ల దాదాపుగా 50శాతం వేస్టేజ్ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు నరసింహుడు, వినోద్ వీఏఏలు షైనీ ప్రియాంక,అశోక్పాల్గొన్నారు.

ఉల్లికి మద్దతు ధర చెల్లించేందుకు రూ.10 కోట్లు మంజూరు : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: అర్లీ ఖరీఫ్‌లో పండించిన ఉల్లి రైతులకు రూ.1200 మద్దతు ధర చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. మంగళవారం ఉల్లి కొనుగోళ్ల అంశానికి సంబంధించి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కొనుగోళ్ల కమిటీ సమావేశాన్ని టెలి కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ ఉల్లి కొనుగోళ్ల ప్రక్రియను ప్రణాళికా బద్ధంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రైతుల నుండి ఆధార్, బ్యాంకు అకౌంట్ తదితర వివరాలను తీసుకుని, ఎక్కడా పొరపాట్లు లేకుండా ఉల్లి కొనుగోళ్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్లీ ఖరీఫ్ లో పండించిన ఉల్లి పంటను మద్దతు ధర రూ.1200లతో కొనుగోలు కోసం ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసినందున, వ్యత్యాసపు ధరను రైతులకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులకు సెప్టెంబర్ 20వ తేదీ దాకా ఎర్లీ ఖరీఫ్ పంట వచ్చే అవకాశం ఉందని హార్టికల్చర్ అధికారులు కలెక్టర్ కు వివరించారు. మార్కెట్ యార్డ్ కు వచ్చే ఉల్లి ఫీల్డ్ నుంచి వస్తోందా లేక ఏమైనా రీసైక్లింగ్ జరుగుతోందా అని పరిశీలించేందుకు 5 మంది హార్టికల్చర్ అధికారులను మార్కెట్ యార్డ్‌లో విధులు నిర్వర్తించేలా నియమించాలని కలెక్టర్ జిల్లా హార్టికల్చర్ అధికారిని ఆదేశించారు. జేసీ డా.బి.నవ్య మాట్లాడుతూ మంగళవారం 200 టన్నులు తాడేపల్లిగూడెంకు, 200 టన్నులు హైదరా బాదుకు, రైతు బజార్‌కు 80 టన్నులు పంపుతు న్నామని వివరించారు. టెలి కాన్ఫరెన్స్‌లో మార్కెటింగ్ శాఖ జెడి రామాంజనేయులు, మార్కెటింగ్ ఏడి నారాయణ మూర్తి, మార్క్ ఫెడ్ డీఎం రాజు, జిల్లా హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, మార్కెట్ యార్డ్ సెక్రెటరీ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సురవరం సుధాకర్ రెడ్డి సేవలు మరువలేనివి

విశాలాంధ్ర - వెల్దుర్తి: మండల కేంద్రంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పిం చారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నక్క లెనిన్ బాబు మాట్లాడుతూ కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మృతి సీపీఐకి తీరని లోటు అని, ఆయన జ్ఞాపకాలు, చేసిన సేవలు ఎప్పటికి మరువలేమన్నారు. రైతులు, కార్మికుల కోసం ఆయన చేసిన పోరాటాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి టి.కృష్ణ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి కోకిల రాజు, ఆటో యూనియన్ జిల్లా నాయకులు ఏసన్న, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు మాధవస్వామి, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి చిన్న మాదులు, చిన్న వ్యాపారస్తుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు అనీలు, రామాంజనేయులు, సిపిఐ మండల నాయకులు శివ, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆహార నాణ్యతలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

విశాలాంధ్ర-గూడూరు: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఆహార నాణ్యత లోపిస్తే వంట ఏజెన్సీ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్టేట్ ఫుడ్ కార్పొరేషన్ కమిషన్ డైరెక్టర్ గంజిమల దేవి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కె.నాగలాపురం, పెంచికలపాడు ప్రభుత్వ పాఠశాలను రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ స్థానిక ఎంఈఓ, ఐసీడీఎస్ సూపర్వైజర్లతో కలిసి అకస్మిక తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా వంట ఏజెన్సీ నిర్వాహకులు పిల్లలకు శుభ్రత ఆహారాన్ని అందించకపోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మధ్యాహ్న భోజనం పథకాన్ని నిర్వీర్యం చేసి విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. మండల విద్యాశాఖ అధికారులు తరచూ తనిఖీలు చేపట్టి నాణ్యమైన ఆహారం, పౌష్టిక ఆహారం అందించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెండవ మండల విద్యాధికారి నాగరాజు, మండల అధికారులు అధికారులు ఉన్నారు.

వాషింగ్ మిషన్‌లు పంపిణీ..

విశాలాంధ్ర - నందవరం: స్థానిక పోస్ట్ ఆఫీస్‌లో దేశాయ్ నెట్వర్క్ అదినేత, బిజెపి నాయకులు గురురాజ్ దేశాయ్ లబ్ధిదారులకు వాషింగ్ మిషన్లు పంపిణి చేశారు. ఆయన మాట్లాడుతూ దేశములో బడుగు బలహీన వర్గాల ప్రజలకు పెద్దపీట వేసిన పార్టీ బిజెపి అని, ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా అన్ని కులాలవారికి పనిముట్ల కొరకు దాదాపుగా రూ.20 వేల వరకు బిజెపి ప్రభుత్వం సహాయం చేస్తుందన్నారు. లబ్దిదారులకు శిక్షణ ఇచ్చి వారికి స్టయిఫండ్ కూడా ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని అర్హత ఉన్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టుమాస్టర్, సిబ్బంది, బిజెపి సినియర్ నాయకులు బి.ఎల్ నారాయణ, మాజీ సర్పంచు రామన్న గౌడు, భీమేష్, కె.శివ, మైనారిటి నాయకుడు అబ్దుల్, విక్టర్, పెయింటర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో రాణించాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో రాణించాలని ప్రముఖ న్యాయవాది జి.శ్రీధర్ రెడ్డి అన్నారు. నగరంలోని ఎ.క్యాంపులో ఉన్న నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి సీనియర్ టెన్నికాయిట్ పోటీలకు ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది జి.శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడాకారుల పరిచయ కార్యక్రమం అనంతరం క్రీడాకారుల ఉద్దేశించి ప్రసంగిస్తూ చిన్నప్పటి నుంచి క్రీడల సాధన చేయడం అలవాటు చేసుకోవాలని, వ్యాయామం తప్పనిసరిగా మన జీవితంలో చర్య కావాలని తెలిపారు. విశిష్ట అతిథి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ అత్యుత్తమ క్రీడా ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు నేరుగా ఉద్యోగాలు కల్పించే వెసలు బాటుని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథి పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ క్రీడా నైపుణ్యం కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడానికి తమ విద్యా సంస్థ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి రమణ వ్యాయామ ఉపాధ్యాయులు వరలక్ష్మి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

ప్రభుత్వ మెడికల్ వైద్య కళాశాల ప్రైవేటీకరణ ఆపాలి

విశాలాంధ్ర - ఆదోని : ఆదోని ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణాన్ని ప్రభుత్వ ఆధీనంలోనే జరిపి పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని సిపిఐ పట్టణ మండల కార్యదర్శిలు టి.వీరేష్ కల్లుబావిరాజు డిమాండ్ చేశారు. మంగళవారం తిమ్మారెడ్డి బస్టాండ్ వద్ద కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ వైద్య కళాశాలలను ప్రజలకు సరైన వైద్యం విద్యార్థులకు సరైన విద్య అందుతుందనే ఉద్దేశంతో గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయడం జరిగింది. కూటమి ప్రభుత్వం విద్యార్థులుకు, ప్రజలకు అన్యాయం చేస్తూ పీపీపీ పద్ధతిలో కొనసాగిస్తామని క్యాబినెట్ మీటింగ్ లో నిర్ణయం తీసుకోవడంతో పేదలకు విద్య అందడం కష్టంగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రజలు విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని 2020 సంవత్సరంలో ఆదోనిలో ప్రభుత్వ మెడికల్ కాలేజ్ నిర్మించడానికి అప్పటి వైద్య శాఖ మంత్రి ఆళ్ల నాని పలుచోట్ల స్థల పరిశీలన చేసి చివరికి అరెకల్ గ్రామం వద్ద మెడికల్ కాలేజ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌హెచ్ 167 పక్కన 48.44 ఎకరాల స్థలంలో రూ.475 కోట్ల ప్రతిపాదనతో 40 పడకలతో ఆసుపత్రి, 100 సీట్లతో మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్, హాస్టల్ కొరకు 2021లో వర్చువల్ పద్ధతిన ప్రారంభించడం జరిగిందని, కూటమి ప్రభుత్వం పనులను చేయక మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయడం సిగ్గుచేటు అన్నారు. కూటమి ప్రభుత్వం ఆదోనిని జిల్లాగా ప్రకటించి, అభివృద్ధికి తోడ్పాటును అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ మండల సహాయ కార్యదర్శిలు రమేష్, కొత్తూరు గంగన్న ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు అంజిత్ గౌడ్, లింగప్ప, డీహెచ్‌పీఎస్ జిల్లా సమితి సభ్యులు విజయ్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రామకృష్ణ, ప్రేమ్, రాము, ఆర్.దావీదు, హుస్సేన్, రాము పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో రిడ్జ్ విద్యార్థి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక లక్ష్మీపురం సమీపంలోని రిడ్జ్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తోటిరెడ్డి కీర్తి సీబీఎస్ఈ జాతీయ స్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో అసామాన్య ప్రతిభ కనబరిచారు. ఈ నెల 3 నుండి 7 వరకు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని అమ్నీవ్ విజన్ పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలలో తలపడి రిడ్జ్ పాఠశాల విద్యార్థి కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. జిల్లాస్థాయి నుండి రాష్ట్రస్థాయికి, రాష్ట్ర స్థాయి నుండి జాతీయ స్థాయి పోటీల వరకు అంచెలంచెలుగా ఎదుగుతూ ఈ స్థాయికి చేరుకున్నారు. తైక్వాండో అనేది ఆత్మరక్షణతో పాటు శారీరక దారుఢ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరు తైక్వాండో నేర్చుకోవాలని పతకం సాధించిన విద్యార్థిని కీర్తి తెలిపారు. పాఠశాల సిఈవో గోపీనాథ్ అభినందనలు తెలిపారు.

పీ4లో భాగస్వాములు కావాలి : జెడ్పీ సీఈవో

విశాలాంధ్ర - నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పీ4 బంగారు కుటుంబాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జెడ్పీ సీఈవో నాసర రెడ్డి అన్నారు. మంగళవారం కనకవీడు, గురజాల గ్రామ పంచాయితీలలో ఐవిఆర్ఎస్ కాల్స్‌పై విచారించి, గ్రామాల్లోని కాలనీలను పరిశీలించి, ఎంపిడిఓ కార్యాలయంలో అధికారులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పి4 కుటుంబాలకు ఆర్థిక సహాయం కాకుండా సామాజిక భద్రత, సామాజిక ఎదుగుదలకు పీ4 కుటుంబాలను ప్రోత్సహించాలన్నారు. పేదరికంలేని సమాజాన్ని నిర్మించాలని, అందుకు ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు అవసరమాన్నారు. జీతాలు చెల్లించకపోతే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమములో ఎంపిడిఓ కృష్ణమూర్తి, తహసీల్దార్ శ్రీనివాసులు, డైప్యూటీ ఎంపిడిఓ సందీప్, మండల కన్వీనర్ ఖాసీంవలి, సొసైటీ చైర్మన్ ధర్మపురం గోపాల్, సీనియర్ నాయకులు మాధవరావు దేశాయ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర-పత్తికొండ: రైతుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విమర్శించారు. మంగళవారం అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా పత్తికొండలో వైసీపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ కూడలి నుండి ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర పాలన అస్తవ్యస్తంగా తయారైందని విమర్శించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల లో నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు, ఆడబిడ్డ నిధి కింద 18 సంవత్సరాలు పైబడిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్న హామీని గాలికి వదిలేశారన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో రైతులు సాగు చేసిన ఉల్లి, టమోటా పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నా కూటమి ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుందన్నారు. వరి, వేరుశనగ, మొక్కజొన్న పంటలకు ఉపయోగించే యూరియా కొరత కారణంగా బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం ఆర్డీఓ భరత్ నాయక్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శులు ప్రదీప్ కుమార్ రెడ్డి, సురేందర్ రెడ్డి, మహిళా రాష్ట్ర కార్యదర్శి శశికళ, ఎంపీపీ నారాయణ దాస్, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, మండల కన్వీనర్ కారం నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గ వైసిపి రాష్ట్ర, జిల్లా నాయకులు సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముమ్మారంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు

విశాలాంధ్ర- క్రిష్ణగిరి: మండల కేంద్రంలో నాణ్యమైన సీసీ రోడ్ల పనులు ముమ్మారంగా కొనసాగుతున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ జాకీర్ హుస్సేన్ అన్నారు. మంగళవానం ఆయన పనులను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే రూ.2 కోట్లకు పైగా సిసి రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. క్రిష్ణగిరి గ్రామంలో సర్పంచ్ వరలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు దామోదర్ నాయుడు ఆధ్వర్యంలో అన్ని వీధులకు నాణ్యమైన సిసి రోడ్లు నిర్మాణ పనులు చేస్తున్నామన్నారు. కేవలం మండల కేంద్రంలోని రూ.40 లక్షల సిసి రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. సిసి రోడ్లతోపాటు డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసి క్రిష్ణగిరి నుండి రామకృష్ణాపురం వరకు రోడ్డుకు గ్రావెల్ వేయడం జరిగిందన్నారు. లక్క సాగరం పంచాయతీ ఆదర్శ పంచాయతీగా తీసుకొని సిసి రోడ్ల నిర్మాణం కొరకు ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్‌కు అందించామన్నారు. కోయిలకొండ, కంబాలపాడు మధ్యలో ఉన్న వంకకు బ్రిడ్జి మంజూరైందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

అక్రమంగా గ్రావెల్ రవాణా

- జొహరాపురంలో అక్రమ గ్రావెల్ రవాణా
- రైతుల ఫిర్యాదుతో మైనింగ్ అధికారుల ఆకస్మిక దాడులు
- ఎకోరాన్ పవన్ విద్యుత్ కంపెనీకి చెందిన రెండు ఇటాచీలు, మూడు టిప్పర్లు సీజ్

విశాలాంధ్ర-ఆస్పరి: మండల పరిధిలోనే జొహరాపురం గ్రామంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలపై రైతుల ఫిర్యాదు మేరకు మైనింగ్ శాఖ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎకోరాన్ పవన్ విద్యుత్ కంపెనీకి చెందిన రెండు ఇటాచిలు, మూడు టిప్పర్లను మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా మైనింగ్ అండ్ జియాలజికల్ రాయల్టీ ఇన్స్పెక్టర్ శివ పార్వతి మాట్లాడుతూ ఎకోరాన్ పవన్ విద్యుత్ కంపెనీ కాంట్రాక్టర్లు రైతుల పంట పొలాల్లో నాన్-అగ్రికల్చర్ అనుమతులు లేకుండా పెద్ద గుంతలు తవ్వి, అక్రమంగా గ్రావెల్ తీసుకెళ్తున్నారని తెలిపారు. దీంతో వ్యవసాయ భూములకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, నష్టపరిహారం డిమాండ్ చేసిన రైతులపై దౌర్జన్యం చేస్తున్నారని, గ్రామ రైతులు కర్నూలు స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. జిల్లా మైనింగ్ అధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ దాడుల్లో పట్టుబడిన రెండు ఇటాచిలను వీఆర్ఓ హరినాయక్‌కు, రెండు గ్రావెల్‌తో ఉన్న టిప్పర్లు, ఖాళీ టిప్పర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు రాయాలిటీ ఇన్‌స్పెక్టర్ శివ పార్వతి తెలిపారు. అక్రమ తవ్వకాల వల్ల ఏర్పడిన గుంతల కొలతలను కూడా అధికారులు నమోదు చేశారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ గ్రావెల్ తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో మైనింగ్ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ హసీనా భాను, సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 10, సెప్టెంబర్ 2025

కారుణ్య నియామకాలు సత్వరమే చేపట్టాలి : ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: జిల్లా పరిషత్ యాజమాన్యంలో పని చేస్తూ మృతి చెందిన ఉద్యోగుల, ఉపాధ్యాయుల కుటుంబాల వారిని కారుణ్యా నియామకాలు చేపట్టాలని ఎస్టీయూ ఆధర్యంలో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాష కోరినట్లు ఎస్టీయూ నాయకులు తెలిపారు. మంగళవారం పశ్చిమ ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి, టీకే జనార్దన్, ఉపాధ్యాయ వాణి సంపాదకులు గాజులు నాగేశ్వరావు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి అజాంబెగ్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాని కలసి హర్షం వ్యక్తం చేశారు. పలు విద్యారంగ, ఉపాధ్యాయ రంగ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు. కారుణ్య నియామకాల కొరకు దరఖాస్తు చేసుకున్న వారు సుమారు 50 మంది దాకా ఉన్నారని, గత ఐదేళ్ల నుండి ఉద్యోగం లేక ఆర్థికంగా చిన్నాభిన్నమవుతూ వారి పిల్లల చదువులు, వివాహాలు అర్ధాంతరంగా ఆగిపోయే ప్రమాదకరమైన పరిస్థితిలు నెలకొన్నాయన్నారు. అర్హతలను సడలించి మేనేజ్మెంట్తో సంబంధం లేకుండా కారుణ్య నియామకాలు సత్వరమే చేపట్టాలని కోరామన్నారు. కలెక్టర్ సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి ఇప్పటివరకు ఏర్పడిన ఖాళీలకు కారుణ్య నియామకాలు చేపట్టుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారని తెలిపారు. జిల్లా పశ్చిమ ప్రాంతమైన ఆదోని, ఆలూరు, పత్తికొండ తదితర ప్రాంతాల్లో ప్రజలు వలసలు వెళుతున్న కారణంగా వారితోపాటు బాల బాలికలు వలసలు వెళ్లకుండా విద్యార్థులు విద్యకు దూరం కాకుండా సీజనల్ హాస్టల్ లను ఏర్పాటు చేయాలని, కేజీబీవీ పాఠశాలలో, మోడల్ స్కూల్ పాఠశాలలో, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో, గురుకుల పాఠశాలలో బాలికలకు సీట్లను పెంచాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ వలసలు వెళ్లే వారి పిల్లల కోసం తగిన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

ఆరబెట్టి, గ్రేడింగ్ చేసిన ఉల్లిని తీసుకురండి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: రైతులు ఉల్లిని ఆరబెట్టి, గ్రేడింగ్ చేసుకొని మార్కెట్ యార్డుకు తీసుకు రావాలని, మార్కెట్ యార్డ్‌కు తెచ్చిన మొత్తం ఉల్లి కొనడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా రైతులకు తెలిపారు. మంగళవారం సాయంకాలం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా కర్నూలు మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా పోలకల్ గ్రామం సి.బెళగల్ మండలంకు చెందిన తెలుగు వెంకట లక్ష్మమ్మ, సంఘాల గ్రామం, సి.బెళగల్ మండలం నాయుడ, సనగండ్ల గ్రామం, గూడూరు మండలంకు చెందిన భరత్ కుమార్ రెడ్డి తెచ్చిన ఉల్లి ఉత్పత్తులను పరిశీలించారు. వీరితో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాగుగా ఆరబెట్టిన, గ్రేడింగ్ చేసిన ఉల్లిని మార్కెట్ యార్డుకు తీసుకుని రావాలని తెలిపారు. తొందరపడి పచ్చిగా ఉన్న ఉల్లి తీసుకురావద్దని సూచించారు. జిల్లాలో పండించే ఉల్లికి మంచి పేరు ఉందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత, అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మహారాష్ట్ర, మన పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌లలో ఉల్లి పంట బాగా పండటం వలన మన ఉల్లికి మంచి రేటు రావడం లేదని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం రూ.12 కేజీ చొప్పున కొంటూ ఉందన్నారు. మార్కెట్ యార్డ్ సెక్రటరీ జయలక్ష్మి మాట్లాడుతూ మార్కెటింగ్ ఫెడరేషన్ శాఖ మంగళవారం వచ్చిన ఉల్లి మొత్తం కొనడం, రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకు తరలించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, కడప మార్కెట్ యార్డ్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు, డిప్యూటీ డైరెక్టర్ లావణ్య, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, కర్నూలు మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, మార్కెట్ యార్డ్ సెక్రటరీ జయలక్ష్మి, జిల్లా హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే అధికారులను సంప్రదించాలి

విశాలాంధ్ర - సి.బెళగల్: రీసర్వే జాబితాలో సమస్యలు, తప్పు ఒప్పులు ఉంటే సరిచూసుకోవాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి సూచించారు. మంగళవారం బ్రాహ్మణ దొడ్డిలో ఆ గ్రామ వీఆర్ఓ మంజీరా సమక్షంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం తహసిల్దార్ మాట్లాడుతూ రీసర్వే పూర్తి అయిన సందర్భంగా జాబితాను విడుదల చేయడం జరిగిందని, జాబితాలో రైతుల పేర్లు, కొలతలు తేడా, ఇతర సమస్యలు ఉంటే చూసుకొని రెవిన్యూ అధికారులను సంప్రదించాలని ఆమె రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర - ఓర్వకల్లు: జలజీవన్ మిషన్ కింద కనమడకల గ్రామంలో రూ.70 లక్షల అంచనా వ్యయంతో మంజూరైన 90 వేల లీటర్ల కెపాసిటీ గల ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్, పైప్ లైన్ నిర్మాణానికి కన్నమడకల గ్రామ నాయకులుఓర్వకల్లు సింగిల్ విండో అధ్యక్షులు సుధాకరయ్య, బొల్లారం వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించడం జరిగినది. మండల పరిషత్ అభివృద్ధి కారి ఎం.శ్రీనివాసులు, అర్‌డబ్ల్యూఎస్ ఎఈ శ్రీనివాసులు పాల్గొనడం జరిగింది. **సొసైటీ చైర్మన్ లకు సన్మానం:** మండల కేంద్రంలోని ఓర్వకల్లు సొసైటీ చైర్మన్ సుధాకర్ రావు, నన్నూరు సొసైటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి లను రిటైర్డ్ ఎడిఅశోకరత్నం ఆధ్వర్యంలో మంగళవారం ఓర్వకల్లు సొసైటీలో శాలువా పూలమాలతో సన్మానించారు. రాంభూపాల్ రెడ్డి, రమణారెడ్డి, కృష్ణయ్య చౌదరి, రాజేంద్రుడు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-గూడూరు: విద్యార్థులు ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన పెంచుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్ సూచించారు. మంగళవారం మండలంలోని కె.నాగలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఫ్లోరోసిస్ వ్యాధి దంతాలపై ప్రభావం చూపుతుందని, ఆ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. పళ్ళు పసుపు పచ్చ రంగులో మారి చిగుళ్ల మధ్య నల్లగా ఏర్పడి దంతాలు పిప్పిపళ్ళుగా తయారవుతాయని గుర్తు చేశారు. పాఠశాల హెడ్మాస్టర్ హిమాం హుస్సేన్, సామాజిక ఆరోగ్య అధికారి ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

పదవులు కాదు.. పార్టీ ముఖ్యం

విశాలాంధ్ర - కర్నూలు : తమకు పదవులు ముఖ్యం కాదని, పార్టీయే ముఖ్యమని ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘువేంద్ర స్పష్టం చేశారు. మంగళవారం నగరంలోని స్థానిక వెంకట రమణ కాలనీలోని ఏఎస్ఎన్ గుడ్ విల్ టవర్స్‌లో కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జయశ్రీ ఆధ్వర్యంలో డైరెక్టర్ నగరూరు రాఘువేంద్ర సన్మాన సభ జరిగింది. పలువురు బీజేపీ నేతలు ఆయనకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పదవులు ఆశించకుండా, పని చేసుకుంటూ పోయే తత్వం మరే ఇతర పార్టీల్లోలేని విధంగా కేవలం ఒక్క భాజపా కార్యకర్తల్లోనే ఉందన్నారు. పార్టీ బలోపేతానికి, పటిష్టతకు శ్రమించే కార్యకర్తలను ఎన్నడూ విస్మరించదన్నారు. పార్టీ కార్యకర్తలకు తానెల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. బీజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి, బీజేపీ కోశాధికారి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళీ నాయుడు, జిల్లా అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ లోకేశ్, న్యాయవాది కోటి యాదవ్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్ నాయుడు, మంజునాథ్, బిజెపి కార్యదర్శి నగేష్, 1వ మండలం అధ్యక్షురాలు మనోహరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : పెద్దకడబూరు గ్రామ శివారుల్లో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వగరూరు గ్రామానికి చెందిన హసీనా మృతి చెందినట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు మంత్రాలయం మండలం వగరూరు గ్రామానికి చెందిన ఖాదర్ బాష, తల్లి హసీనాతో బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్‌పై ఆదోనివైపు నుంచి వస్తుండగా, మండల పరిధిలోని చిన్నకడబూరు గ్రామానికి చెందిన కల్లు లక్ష్మయ్య కుమారుడు బోయకల్లు హనుమయ్య తన మోటార్ సైకిల్‌పై పెద్దకడబూరు నుంచి వెళుతుండగా గ్రామ శివారులో ఉన్న స్వామి షాపు ముందు వగరూరు ఖాదర్ బాష వేగంగా, అజాగ్రత్తగా చిన్న కడబూరు గ్రామానికి చెందిన బోయ హనుమయ్య మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టాడు. దీంతో ఆమె కిందపడి రక్త గాయాలు కాగా, కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. బోయ హనుమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

నేడు సురవరం సుధాకరరెడ్డి సంస్మరణ సభ

విశాలాంధ్ర - కోడుమూరు: పట్టణంలోని శ్రీ స్నేహ వినాయక కళ్యాణ మండపంలో బుధవారం సిపిఐ పూర్వపు జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు దివంగత నేత కామ్రేడ్ సురవరం సుధాకర రెడ్డి సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు సిపిఐ నాయకులు బి.కృష్ణ, బి.రాజు, శేషకుమార్ యాదవ్, చిన్న రాముడులు తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ పి.రామచంద్రయ్య తోపాటు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిలు లెనిన్ బాబు, ఎస్.మునెప్ప తదితర ప్రముఖులు హాజరవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు బజారి,ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మధు, ఏఐఎస్ఎఫ్ నాయకులు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకు నిర్మాణాన్ని నాణ్యతగా చేపట్టాలి

విశాలాంధ్ర - సి.బెళగల్ : ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం పనులను నాణ్యతగా చేపట్టాలని డిఈ మహబూబ్ ఖాన్ అన్నారు. సి.బెళగల్‌లో చేపట్టిన ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం పనులను డీఈ మహబూబ్ ఖాన్ మంగళవారం ఆర్డబ్ల్యూఎస్ఏ ఇగోనె నాయక్‌తో కలిసి తనిఖీ చేశారు. తనిఖీ అనంతరం డీఈ మాట్లాడుతూ దాదాపు రూ.90 లక్షలలతో నిర్మాణం చేపడుతున్న ట్యాంకు ట్యాంక్ నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలన్నారు. నీళ్ల స్టోరేజ్ దగ్గర బెడ్ పనులు చేపడుతున్న దానిని పరిశీలించి జల్ జీవన్ మిషన్ కింద సుమారు రూ.90 లక్షలు కేటాయించారని, 40వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకును నాణ్యతగా చేపట్టాలని ఆయన అధికారులకు ఆదేశించారు. ట్యాంకు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ట్యాంకును అందుబాటులోకి తీసుకువస్తే తాగునీటి సమస్య ఏమాత్రం ఉండదన్నారు.

లీకేజీ తాగునీటి పైపుల మరమ్మతులు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని తహ సీల్దార్ కార్యాలయం సమీ పంలో లీకేజీ తాగునీటి పైపు లను తొలగించివాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేశారు. మంగళవారం గ్రామ సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో లీకేజీ తాగునీటి పైపులకు మరమ్మ తులు చేపట్టడంతో పాటు వినియోగం కానీ పైపులను తొలగించి కొత్త వాటిని అమర్చారు. గత కొంతకాలంగా తహసిల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం ఎదుట తాగునీరు సరఫరా చేసే పైపులు దెబ్బతిన్నాయి. దీంతో లీకేజీలు ఏర్పడి తాగునీరు కలుషితమైందని, సర్పంచ్ శివ రాముడు స్పందించి పాత పైపులను తొలగించి, కొత్త వాటిని ఏర్పాటు చేసి తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకున్నారు.

స్కూలు బస్సు ఢీకొని బాలుడు మృతి

విశాలాంధ్ర-అవుకు: మండలంలోని సుంకేసుల గ్రామంలో స్కూలు బస్సు ఢీకొని బాలుడు ఎర్రబెల్లి మహిదర్ మృతి చెందిన సంఘటన మంగళ వారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుంకేసుల గ్రామానికి చెందిన ఎర్రబెల్లి శ్రీనివాసులు, మీనాక్షిలకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు. రెండవ కూతురు కోయిలకుంట్ల పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నది. కూతు రును పాఠశాలకు చెందిన బస్సులో ఎక్కించేందుకు రాగా కుమారుడు ఎర్రబెల్లి మహిదర్ బస్సు వద్దకు రావడం జరిగింది. బస్సు డ్రైవరు బాలుడిని గమనించకుండా నిర్లక్ష్యంగా ముందుకు నడవడంతో బస్సు ఢీకొని బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన బాలుడిని అదే స్కూలు బస్సులో అవుకు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టు మార్టం నిర్వహించారు. ఈ మేరకు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి వెల్లడించారు.

ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: రాష్ట్ర వైసీపీ పిలుపుమేరకు ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాతపోరు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని స్థానిక వైసీపీ కార్యాలయం నుండి శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గం వైసీపీ ఇంచార్జీ దారా సుధీర్ బాబు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, నందికొట్కూరు ప్రాంతాల రైతన్నలు పాల్గొని బైక్ ర్యాలీగా ఆర్డీవో కార్యాలయం వరకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు ఆర్డీవో నాగజ్యోతికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వాళ్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతన్నలకు యూరియా అందించడంలో విఫలమైందన్నారు.

ఉపరాష్ట్రపతి ఎంపికకు ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ఢిల్లీలోని భారత పార్లమెంట్ ఆవరణలో మంగళవారం జరుగుతున్న భారత ఉప రాష్ట్రపతి ఎంపిక ఎన్నికల్లో నంద్యాల ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి క్యూలో నిలిచి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం భారతదేశ బలానికి ప్రతీక అని, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామిగా ఉండేందుకు తన ఓటు హక్కు వినియోగించుకోవడం గర్వంగా ఉందని ఆమె చెప్పారు.

బస్సు కోసం విద్యార్థుల పడిగాపులు

విశాలాంధ్ర - హొళగుంద: సులువాయి గ్రామానికి సమయానికి బస్ నడపాలని బస్సు విద్యార్థులు, విద్యార్థి సంఘం నాయకులు, గ్రామ వాసులు మంగళవారం బస్సును అడ్డుకున్నారు. సిఐటియు మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ సులవాయి, పెద్దహేట మూగమన గుంది, సమతగేరిలో దాదాపు వంద మంది విద్య కోసం హొళగుందకు రాకపోకలు కొనసాగిస్తున్నారనిబస్సులను పాఠశాల కళాశాల సమయానికి అనుకూలంగా నడపాలని డిమాండ్ చేశారు. తాము ప్రతిరోజు పాఠశాల కళాశాలకు వస్తున్నప్పటికీ బస్సుల ఆలస్యంతో తమకు ఆబ్సెంట్ పడుతుందని, ఇదేవిధంగా ఆబ్సెంట్ పడితే హాజరు తక్కువ ఉందని హాల్ టికెట్లు ఇవ్వక పరీక్షలకు కూర్చోబెట్టరని విద్యార్థులు తెలిపారు. సాయంత్ర సమయంలో కూడా ఇంటికి వెళ్లేసరికి రాత్రి 7 అవుందని విద్యార్థులు తెలిపారు. ఆర్టీసీ అధికారులను అడిగితే రోడ్లు బాగా లేకపోతే మేమేం చేయాలని మీ ఊరికి త్వరలోనే సర్వీసులను నిలిపి వేస్తామని చెబుతున్నారన్నారు. బస్సును అడిగితే రోడ్ల గురించి చెబుతున్నారని ప్రభుత్వం రోడ్లు వేయకపోతే తామేం చేయాలని ప్రశ్నించారు.

విజ్జి పై అసత్య ప్రచారాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు : ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో గత 20 సంవత్సరాలుగా సామాజిక సేవ దృక్పథంతో పనిచేస్తున్న ఎంఆర్పిఎస్ సీనియర్ జిల్లా నాయకులు విజ్జి మాదిగపై ఆత్మగౌరవానికి భంగం కలిగేలా కరపత్రాలు ముద్రించి, అసత్య ప్రచారం చేసిన ప్రజాబంధు పార్టీ నాయకులు పల్లె నాగరాజు పంపిణీ చేసిన కరపత్రాలు జాలం శ్రీనులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నాయకులు లింగాల రామకృష్ణ మాదిగ, కనకం నాగన్న మాదిగ, ప్రేమ రాజు మాదిగ, సురేష్ మాదిగ లు పట్టణ పోలీస్ సర్కిల్ కార్యాలయం నందు సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి అనుబంధ సంఘాల నాయకులు ప్రేమ్ రాజ్ మాదిగ, రామకృష్ణ మాదిగ కనకం మాదిగలు పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో పనిచేసిన సీనియర్ నాయకులు ఎంతోమంది ఉద్యమ స్ఫూర్తితో సామాజిక దృక్పథంతో జాతి అభ్యున్నతి కోసం ఎంతో త్యాగం చేశారన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సగ్గేలా విజ్జి మాదిగ ఎన్నో ఉద్యమ పోరాటాలకు పాల్గొని ఉద్యమం కోసం అనేక సేవలు చేశారన్నారు. సమాజంలో సేవా దృక్పథంతో వ్యవహరించే మనసత్వం కలిగిన వ్యక్తి నాయకులు విజ్జి మాదిగ అని స్పష్టం చేశారు. అలాంటి గొప్ప మనసుతో కుల మతానికి అతీతంగా దళిత సామాజిక వర్గానికి చెందిన శెట్టి సుజాత భర్త నాగన్న, ప్రజాబంధు పార్టీ పల్లె నాగరాజు మధ్య జరిగిన విషయంలో నిరుపేద మహిళా అయినా శెట్టి సుజాత కుటుంబానికి అండగా నిలుస్తూ వారికి సహాయ సహకారాలు చేస్తే తప్పు అని వారు ప్రశ్నించారు. విజ్జి మాదిగచే సహాయ సహకారాలు పొందినప్పుడు ఇలాంటి అసత్య ప్రచారాలు గుర్తుకు రాలేదా, అప్పుడు మంచివాడు అయింది ఇప్పుడు మీకు వ్యతిరేకంగా నిరుపేద కుటుంబానికి అండగా ఉన్నాడని అసూయ పడడం కుట్ర పడడం, అవమానకర రీతిలో దుష్ప్రచారం చేయడం నాయకుడు అనుకుని చెప్పుకుంటున్న నీకు కనీసం సిగ్గుందా అని వారు మండిపడ్డారు. నీ చరిత్ర ఒక బురదమయమని, అవి మాట్లాడటం మొదలు పెడితే తట్టుకోలేవంటూ హెచ్చరించారు. అలాంటి తమ ఉద్యమ సహచర ఎంఆర్పిఎస్ జిల్లా నాయకులు విజ్జి మాదిగపై ప్రజా బంద్ పార్టీ నాయకుడు అని చెప్పుకుంటున్న పల్లె నాగరాజు తన ప్రవర్తన తీరు మార్చుకోకపోతే తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సి వస్తుందని, సామాజిక స్పృహతో వ్యవహరించాలని వారు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జూపాడుబంగ్లా మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షుల హనుక్ మాదిగ ఎంఆర్పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

రోగుల నుండి డబ్బు వసూలు చేస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని, రోగుల నుండి డబ్బు వసూలు చేస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆసుపత్రి యాజమాన్యాలను హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్టీఆర్ వైద్య సేవకు సంబంధించి ప్రైవేట్ నెట్వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు ఉచితంగా వైద్యం అందించే పథకమని, రోగుల నుండి డబ్బు తీసుకోవడం సముచితం కాదని కలెక్టర్ తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగులకు మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించాలని, కమర్షియల్ పద్ధతిలో ఆలోచన చేయకూడదని కలెక్టర్ ప్రైవేట్ నెట్వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలను ఆదేశించారు.. ఆసుపత్రికి ఎవరైనా రోగులు వచ్చినప్పుడు వారు ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ కార్డు మర్చిపోయిన ఎడల వారిని ముందుగా ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఎన్రోల్ చేసి ఉచితంగా ఓపి పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ప్రైవేట్ నెట్వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలను ఆదేశించారు. ఆసుపత్రి యాజమాన్యాలు రోగుల నుండి డబ్బు తీసుకుంటున్నట్లు ఐవిఆర్ఎస్ ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయ సేకరణలో తేలిందన్నారు. నగరంలోని అమీలియో, ఎంఎస్ ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, స్టార్ కేర్, ఒమేగా ఆసుపత్రులలో ఎన్టీఆర్ వైద్య సేవ కింద రోగుల నుండి డబ్బులు తీసుకుంటున్నట్లు ప్రజల నుండి ఫిర్యాదులు అందాయన్నారు. ప్రజల నుండి ఫిర్యాదులు రాకుండా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ ఆసుపత్రుల యాజమాన్యాలకు సూచించారు. ఏం ఎస్ ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వారు సమావేశానికి హాజరు కానందున నోటీస్ ఇవ్వాలని కలెక్టర్ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌ను ఆదేశించారు. ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వం నుండి పెండింగ్‌లో ఉన్న బకాయిలకు సంబంధించి డిఓ లెటర్ సిద్ధం చేయాలని కలెక్టర్ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌ను ఆదేశించారు. సమావేశంలో ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డా.ఎంవిఎన్ఎస్వి భాస్కర్ రెడ్డి, ఇంచార్జీ డిఎంహెచ్ఓ డా.లలిత దేవి, డిసిహెచ్ఎస్ డా.జఫ్రుల్లా, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు పాల్గొన్నారు.

యోగానుష్ఠానం వల్ల జీవన్ముక్తి లభిస్తుంది

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: యోగానుష్ఠానం వల్ల ఆత్మసాక్షాత్కారంతోపాటు, జీవన్ముక్తి లభిస్తుందని అప్పుడే మానవజన్మకు సార్థకత చేకూరుతుందని ఇస్కాన్ ధర్మ ప్రచారకులు కీర్తి రాజదాసు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని మల్లెం గ్రామంలోని రుక్మిణీ పాండురంగ స్వామి దేవస్థానం నందు ధార్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటి రోజు శ్రీమద్రామాయణంపై ధార్మిక ప్రవచనం చేశారు. తదనంతరం స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి మాట్లాడుతూ ధార్మిక వ్యాప్తిలో భాగంగా ఐదురోజుల పాటు శ్రీమద్రామాయణము, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ రుక్మిణి పాండురంగ స్వామి దేవస్థానం ధర్మకర్త పొలిమేర హనుమంతరావు, ధర్మ ప్రచారమండలి సభ్యులు పి.రామచంద్రుడు, ఎ.శివశంకర రెడ్డి, మాకం కుమారస్వామి, విశ్వనాథం నారాయణ, కృష్ణయ్య, గానుగ శంకరయ్య, రామేశ్వర రెడ్డి, బాలమ్మ పార్వతిదేవి, మల్లికాదేవి, శేషమ్మ, మణి, గ్రామ పెద్దలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అనధికారికంగా నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించడంలో రాష్ట్ర మంత్రిపై చేస్తున్న ఆరోపణలు నిజం కాదు

విశాలాంధ్ర - కర్నూలు : నగరంలోని ఏ క్యాంపుతో పాటు, బీ క్యాంపులో ఉన్న క్వార్టర్లలో అనధికారికంగా నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించడంలో రాష్ట్ర మంత్రి టీజీ భరత్ పాత్ర ఉందని కొంతమంది చేస్తున్న దుష్ప్రచారం లో వాస్తవం లేదని తెలుగుదేశం పార్టీకి చెందిన కార్పొరేటర్లు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు, టిడిపి నాయకులు స్పష్టం చేశారు. కర్నూలు నగరంలోని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ చెందిన 22వ వార్డు ఇంచార్జ్, న్యాయవాది శ్రీధర్, కార్పొరేటర్లు పద్మలత రెడ్డి, క్రాంతి కుమార్, 16వ వార్డు ఇంచార్జీ రామాంజనేయులు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు శ్రీధర్, పవన్ కుమార్, మారుతి శర్మ, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాజు యాదవ్ తదితరులు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు నగరం రాజధానిగా ఉన్న సమయంలో కర్నూలులోని ఏ క్యాంపు, బీ క్యాంపులో నిర్మించిన క్వార్టర్లలో కొంతమంది అనధికారికంగా నివసిస్తున్నారని తెలిపారు. వీరిని ఖాళీ చేయించాలని అధికారులు ఎంతో కాలంగా వారికి నోటీసులు జారీ చేసి కోరుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, ఇక్కడ ఉన్న మురుగునీటి కాలువ వ్యవస్థ పూర్తిగా పాడైపోయిందని స్పష్టం చేశారు. ఏ క్యాంపు, బీ క్యాంపు క్వార్టర్లలో అనధికారికంగా నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించాలని గత సంవత్సరం నవంబర్ నుంచి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అధికారులు నోటీసులు జారీ చేశారని చెప్పారు. ఈ నేపథ్యంలో అక్కడ అనధికారికంగా నివాసం ఉంటున్న వారు రాష్ట్ర మంత్రి టీజీ భరత్‌ను కలిసి ఆరు నెలలు గడువు కోరారని తెలిపారు. వారి విజ్ఞప్తిని అర్థం చేసుకున్న రాష్ట్ర మంత్రి టీజీ భరత్ వారికి ఈ ఏడాది జూన్ నెలాఖరి వరకు గడువు ఇచ్చారని, ఆలోగా ఖాళీ చేయాలని సూచించారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే చాలామంది అక్కడ అనధికారికంగా నివాసం ఉంటున్న వారు గృహాలను ఖాళీ చేసి వెళ్లిపోయారని తెలిపారు. జూన్ నెలాఖరి వరకు గడువు ఇచ్చినప్పటికీ ప్రస్తుతం సెప్టెంబర్ మాసంలో ఉన్నప్పటికీ అక్కడ అనధికారికంగా నివాసం ఉంటున్న వారు ఖాళీ చేయలేదని, ఈ నేపథ్యంలో అధికారులు జారీ చేసిన నోటీసులకు స్పందన లేకపోవడంతో వారిని ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఈ క్రమంలో కృష్ణ అనే వ్యక్తి ఏ క్యాంప్‌తో పాటు బీ క్యాంప్ లో ఉన్న క్వార్టర్లను ఖాళీ చేయించడంలో రాష్ట్ర మంత్రి టీజీ భరత్ పాత్ర ఉన్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారని వివరించారు. ఈ ప్రాంతంలో 10 నుంచి 15 వరకు గృహాలను తీసుకొని అనధికారికంగా అద్దెకి ఇచ్చి ఆదాయం పొందుతున్న వారు అమాయకులను రెచ్చగొట్టి ఈ ఖాళీ చేసే ప్రక్రియకు రాష్ట్ర మంత్రి టీజీ భరత్ ను బాధ్యుడిని చేస్తూ అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని తెలియజేశారు. ఈ క్వార్టర్లలో నివాసం ఉంటున్న వారికి వారి కోరిన దానికంటే రెండు నెలలు రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అధికంగా సమయం ఇచ్చిన విషయాన్ని కూడా మర్చిపోయి ఆయనపై నిందలు వేయడం ఎంత మాత్రం తగదని చెప్పారు. కేవలం ఏ క్యాంపు తో పాటు బి క్యాంప్ లో అధిక సంఖ్యలో క్వార్టర్లను ఆక్రమించుకొని వాటిని అక్రమంగా అద్దెకి ఇచ్చి ఆదాయం పొందుతున్న వారు తమ స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర మంత్రి టీజీ భరత్ పై ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని స్పష్టం చేశారు. కర్నూల్ నగరంలో టీజీవి కుటుంబం ఎప్పుడు ఇలాంటి చర్యలకు పాల్పడదని తెలిపారు. రాష్ట్ర మంత్రి టీజీ భరత్ కర్నూలు నగరంలో ఇల్లు లేని వారు ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, అలాగే స్థలాలు ఉన్నవారు ఇల్లు కట్టుకోవడానికి రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని స్వయంగా విజ్ఞప్తి చేస్తున్నారని, అలాంటి వ్యక్తిపై ఇలాంటి ఆరోపణలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. అలాగే కర్నూల్ లో పరిశ్రమలు ఏర్పాటు ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర మంత్రి టీజీ భరత్ ఎంతో కృషి చేస్తున్నారని వెల్లడించారు. ప్రస్తుతం ఏ క్యాంపు తో పాటు బీ క్యాంపులో క్వార్టర్లను ఖాళీ చేసిన సమయంలో అక్కడ అనధికారికంగా నివాసం ఉన్నవారి నుంచి ఒక్కొక్కరి నుంచి వెయ్యి రూపాయలు వసూలు చేస్తూ తాము తిరిగి వాటిని స్వాధీనం చేస్తామని కొంతమంది ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలియజేశారు. ఎప్పటికైనా నిజాయితీగా పనిచేస్తున్న రాష్ట్ర మంత్రి టీజీ భరత్ పై అనవసరమైన ఆరోపణలు చేయడం మానుకోవాలని స్పష్టం చేశారు.